కథానిక-గిడుగు రాజేశ్వరరావు

# మౌనయానం

**జీవితం కూడా రైలు ప్రయాణం లాంటిదేనన్న మాట నిజమే కానీ, ఒక్కొక్కసారి రైలు ప్రయాణం మన మీద కలిగించే ప్రభావం ఓ జీవిత కాలానుభవం అవుతుంటుంది**

చిన్న కూతురి కాపురం చూసిపోదామని వచ్చిన గోపాలయ్య వరంగల్‌కి ప్రయాణమయ్యాడు. గడగడ వణకించిన చలి విరిగి, తెల్లవారుజామున వీచే గాలి ఎంతో హాయిగా, ఆహ్లాదంగా ఉంది. నవజీవన్ ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫామ్ మీద బయలుదేరడానికి సిద్ధంగా ఉంది.

అల్లుడు చిన్న ట్రంకుపెట్టెనూ, కూతురు నంచీని పట్టుకుని హడావిడిగా వెళ్తూ ఉంటే వెనుకనే వడివడిగా అడుగులేసుకుంటూ నడుస్తున్నాడు. రైలు పెట్టెకంటించి ఉన్న కాగితాన్ని ఒకసారి చూసి తన చేతిలోని టికెట్‌ను మామగారికందిస్తూ, "మీది తొమ్మిదో నంబరు బెర్తు, కిందనే ఉంది. మీ సీటు కూడా కిటికీ పక్కనే" అన్నాడు అల్లుడు.

"నాన్నా, మొహమాటపడి మీ బెర్తు మార్చుకోకండి. ఎక్కి దిగే ప్రయాస వద్దు. ఇంటికి వెళ్ళేదాకా పెట్టె తెరిచే అవసరం ఉండకుండా ఈ నంచీలోనే తువ్వాలు, దుప్పటి, చిన్న దిండూ ఉంచాను..."

కూతూరి ప్రేమకు చిన్నగా నవ్వుకున్నాడు. "అలాగేలేవే..." అన్న తండ్రి మాట ఇంకా పూర్తి కానివ్వకుండానే అడ్డుపడుతూ, "ఆ టిఫిన్ బాక్స్‌లో అన్నం పాలలో వేసి తోడు పెట్టాను. భోజనం వేళకి తియ్యగా తోడుకుంటుంది. అందులోనే చెమ్చా కూడా ఉంది" అని గుర్తు చేసింది.

"అత్తగారిని కూడా తీసుకురావలసింది. ఈ వయసులో అసలు మీరిద్దరూ అక్కడెందుకూ? ఇక్కడికే వచ్చేయండి." అల్లుడి ఆహ్వానం.

"పొగలు సెగలు కక్కే ఈ మహానగరంలో మీకు తప్పదు. మేమెందుకూ? ఈ భాష, ఈ వాతావరణం మీ అత్తగారు అసలు తట్టుకోలేదు..."

"చల్లటి మంచినీళ్ళ పెద్ద సీసానిండా ఉన్నాయి. ఆ సీసా పక్కనే కడిగి పెట్టిన ద్రాక్షపళ్ళు ఉన్నాయి. నంచీని అందుకునేలా పెట్టుకుని దాహం వేస్తే... "

గార్డు విజిల్ వినిపించింది. రైలుబండీ కదిలింది. కదుల్తున్న రైలుపెట్టెతో ముందుకు నడుస్తూ కూతురు జాగ్రత్తలు చెప్తూనే ఉంది. గోపాలయ్య సమాధానంగా కిటికీలోంచి చేతులు ఊపుతూ ఉంటే ఒక్కమారుగా రైలు వేగం పుంజుకుని అల్లుడూ, కూతురూ చరచర అతివేగంగా వెనక్కు నడుస్తున్నట్లు దూరమైపోయారు.

రైలుపెట్టెలోకి దృష్టి సారించేలోగా, "మీ అమ్మాయీ, అల్లుడూనా" అని హిందీలో కాస్త మరాఠీ యాసతో అడిగింది తన సీటుకి ఎదురు సీటులో ఉన్న అమ్మాయి. అవునని తల ఊపాడు.

"అమ్మాయిది అంతా మీ పోలికే. చూస్తూనే అనుకున్నాను. మీరంటే ఎంత ప్రేమ...?"


"మీరెంతదాకా?"

"వార్ధా. అంతవరకూ ఇంకో కూతురు మీ రైలుపెట్టెలో ఉందని అనుకోండి." నవ్వింది. నవ్వకపోయినా ఆమె పెదవులు నవ్వినట్లే ఉన్నాయి. చిరునవ్వుతో ఇంకా అందగించాయి. ఆమె చేతుల్లో రెండు నెలల చంటిగుడ్డు.

చేతిలోని నంచీనీ, పెట్టెనూ తన సీటు కింద పెట్టుకోవాలని ప్రయత్నించాడు. అప్పటికే ఆ సీటు కింద పూర్తిగా పెట్టెబేడా సర్దేసి ఉంచారు ఎవరో. ఖాళీ లేదు. తన కెదురుగా ఉన్న పై బెర్తువేపు చూశాడు. దాని మీద కూడా పైకప్పుకు తాకేలాగ సామాన్లు నింపేశారు. రాత్రి బెర్తుమీద నిద్రపోయే ఉద్దేశమే లేదా ఏం? ఇక్కడ ఎక్కే ప్రయాణికులు చాలామంది వ్యాపారులే. విపరీతంగా బరువులతో వచ్చి అందరినీ కష్టపెడతారు- అని విసుక్కున్నాడు గోపాలయ్య.

"నా సీటు కింద కాసింత జాగా ఉంది. మీ పెట్టెను పెట్టుకోండి సరిపోతుంది. మీకు కనిపిస్తూనే ఉంటుంది. ఆ నంచీని మీకు దగ్గరగా అక్కడ ఉంచండి." బాలెంత ఇచ్చిన సలహా బాగున్నదనుకుని పాటించి, తన చేతికి అందేలా నంచీని కాలికి దాపుగా పెట్టుకున్నాడు.

టికెట్ ఎగ్జామినర్ వచ్చి వెళ్ళాడు. బెల్లం చుట్టూ ఈగలు వాలినట్లు వెంటపడేవాళ్ళతో 'లాభం లేదు అర్ధరాత్రికి కొన్ని బెర్తులు దొరికే అవకాశం ఉంటుంది' అని నిష్కర్షగా చెప్పి సాగిపోయాడు. అతనూ వెళ్ళగానే, తన పరిసరాల్లోని ప్రయాణికులు




తీరికగా తేనీరు తాగుతూ గలగల హడావిడిగా గుజరాతీలో ముచ్చట్లు చెప్పుకుంటున్నారు. రైలు బండి వడోదరా దాటి పరుగు తీస్తోంది.

బాలెంత పిల్లడికి పాలు కుడుపుతూ ఉంటే, ఆమె వెనకనే నిలబడ్డ మూడేళ్ళ పాప తమ్ముడి జుత్తును మునివేళ్ళతో తాకుతూ కదిలిస్తోంది. పాలు తాగడం మాని మత్తుగా చూస్తున్నాడు పసివాడు. నాయనమ్మ దగ్గరకో, తండ్రి దగరకో పోయి కూర్చోమని ఆ పాపను మందలిస్తోంది తల్లి. బాలెంత పక్కనే ఉన్న వృద్ధురాలు నొసట సన్నగా పచ్చబొట్టు, ముడతలు పడ్డ మొహం. ఆమె మనుమరాల్ని ఒళ్ళో కూర్చోపెట్టుకునే ప్రయత్నం చేస్తోంది కానీ, విని అర్థం చేసుకునే వయసు కాదు పాపది. ముసలామెకు పక్కనే కూర్చున్న యువకుడు బాధ్యతల బరువు నెత్తిమీద ఉన్నట్లు గంభీరంగా మొహం పెట్టుకుని ఇంకో వేపు కిటికీలోంచి కదలిపోతున్న చెట్టూచేమనీ చూస్తున్నాడు. వయసు పాతిక మించదు. గోపాలయ్య తన వీపుని కిటికీ అద్దానికి దాపు పెట్టి రెండు కాళ్ళూ తాను కూర్చున్న బెర్తు మీదకి పెట్టుకుని వాటిని ఇతర ప్రయాణికులకు తగలకుండా ముడుచుకుని, వెనులుబాటు చేసుకుని చిన్న కోడి కునుకు తీస్తున్నాడు. బాలెంత పసివాణ్ణి గోడవారగా మెత్తని దుప్పటి పరిచి పడుకో పెట్టి, దాపుగా తాను కూర్చుని కిటికీలోంచి బయటకు చూస్తోంది.

సూరత్ స్టేషన్ రాగానే గలగల మాట్లాడుకుంటూ ప్రయాణికులు మంచి నీళ్ళకూ, మసాలా చాయ్‌కూ, పకోడీలకూ, బీడీలకూ ప్లాట్‌ఫామ్ పైకి దాడిచేశారు. ఆ సందడికి కళ్ళు తెరచిన గోపాలయ్య తన చేతి సంచీని అందుకోబోతూ ఉండగా తన పక్కనే వెక్కివెక్కి ఏడుపు వినిపించింది. మరాఠీ యువకుడు బాలెంత నోటిని గట్టిగా మూసి ఏడవవద్దని తన స్వరం పెంచి మందలిస్తున్నాడు. వాడి తల్లి కూడా కళ్ళు విప్పి, నోరు తెరచి ఏమీ అర్థం కాక ఆశ్చర్యంగా

చిత్రాలు: నర్సిం



"వార్ధా ఎందుకు?"

"అదే నా ఊరు. అక్కడ నా చిన్నాయన, కొందరు బంధువులు ఉన్నారు. ఒక పాత ఇల్లు ఉంది. నా వాళ్ళనూ, సామానూ అక్కడ దించి, రెండు రోజుల్లో సిక్కిం బయలుదేరి పోవాలి. ఇలాటి పరిస్థితిలో ఇలా జరిగింది. అంతా నా దురదృష్టం..." ఆ యువకుడు గాఢంగా నిట్టూర్చాడు.

"మరి ఏం చేస్తావ్...?"

"అందరికీ తెలుస్తే గొడవ అవుతుందేమోననే

**బాలెంత పసివాణ్ణి ఒకమారు చూసి ఏడుపు ఆపుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. హాయిగా ప్రారంభం అయిన ప్రయాణంలో ఏదో అపశ్రుతి.**

చూస్తోంది. గోపాలయ్యకు ఆ దృశ్యం కలవర పెట్టేసింది. ఆ యువకుడు మరాఠీలో తల్లికి ఏదో చెప్పి హడావిడిగా కంపార్ట్‌మెంట్ బయటికి చరచరా వెళ్ళిపోయాడు. బాలెంత గుడ్డ మడతల్లోంచి పసివాణ్ణి ఒకమారు చూసి, కిటికీ వేపుగా మొహం చాటు చేసుకుని ఏడుపు ఆపుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. శబ్దం రాకుండా ఏడ్చే ప్రయత్నంలో ఆమె భుజాలు అదిరిపడుతూ దుఃఖపు ఒత్తిడిని తెలియజేస్తున్నాయి.

ఎక్కడ చూసినా ఆవేశాలు, ఘర్షణలు. అసలు ఈ తరం యువతలో వస్తువుల మీదా, సదుపాయాల మీదా మమకారం తప్ప మనుష్యుల మీద మమత, అనురాగం పెంచుకోలేకపోతున్నారని మనసులో అనుకున్నాడు గోపాలయ్య. అదేదో భార్యాభర్తల పోట్లాట అయి ఉంటుంది. ఏ కారణం తెలియకుండా ఏమని కలగచేసుకోవడం. చల్లని వేళ హాయిగా ప్రారంభం అయిన ప్రయాణంలో ఏదో అపశ్రుతి వచ్చిపడినట్లనిపించి, తన సీటులోంచి లేచి వెళ్ళి రైలుపెట్టె తలుపు దగ్గర నిలుచున్నాడు. ప్లాట్‌ఫామ్ మీద రణగొణధ్వనులు వింటూ ప్రయాణికుల హడావిడిని చూస్తున్నాడు. కాలుకాలిన పిల్లిలా ఇటూ అటూ తిరుగుతున్న మరాఠీ యువకుడు తలుపు దగ్గరకు వచ్చి నిలబడ్డాడు.

"ఎంతవరకూ మీ ప్రయాణం" అని హిందీలో మాట కలిపి ఏమైనా వివరంగా అసలు విషయం తెలుస్తుందేమో అని చూశాడు గోపాలయ్య.

"వార్ధా" అన్నాడు పూడుకుపోయిన గొంతు విప్పి.

"అమ్మాయికి ఆరోగ్యం సరిగ్గా లేదా? ఏడుస్తోంది" అని నీళ్ళు నమలకుండా స్పష్టంగా అడిగేశాడు.

"పిల్లవాడు నిద్రపోతూ చనిపోయాడు" అన్నాడు దుఃఖం ఆపుకునే ప్రయత్నం చేస్తూ.

"ఎలా?" ఆశ్చర్యంగా స్పందించాడు గోపాలయ్య.

"అదే మాకూ తెలియదు. బయలు దేరినప్పుడు ఎటువంటి బీమారీ లేదు. నిద్రలోనే ఆయువు ఎగిరిపోయింది. పాలు ఇవ్వడానికి ఎత్తుకోబోతే శ్వాస ఆడడం లేనే లేదు."

"మరి ఇలా దేనికి కాలయాపన? దిగి వెనక్కు వెళ్ళిపోవాలి కదా..."

"వెనక్కా? ఎవరున్నారక్కడ? నేను ఫౌజీలో జవాన్‌ని. ఉన్నట్లుండి సిక్కింకి బదలీ చేశారు. నన్ను రిలీవ్ చేశాక నా సర్వస్వం మూటా ముల్లే కట్టి బయలుదేరాను..."

భయం. నన్ను దించేస్తారు కాబోలు. అర్థంతరంగా ఎవరూ లేని చోట ఇంత సామానూ, నేనూ ఏమైపోతాను..." గుడ్లలో నీరు తిరిగింది.

రైల్వే నియమాలు సరిగ్గా గోపాలయ్యకూ తెలియవు. ఏమి సలహా ఇవ్వడానికీ పాలుపోలేదు. ప్రయాణంలో పెద్దవాళ్ళు చనిపోతే దించేస్తారని విన్నాడు కానీ, ఆ నియమం వేలెడు గుడ్డుకి కూడా వర్తింపజేస్తారో లేదో. ఎవర్ని కదిపితే ఏమి చిక్కు వచ్చి పడుతుందో. అందరూ సానుభూతితో ఆలోచించరు కదా.

ఇలా గిజగిజలాడుతూ ఉంటే గార్డు విజిల్ వినిపించింది. రైలూ కదిలింది. మరాఠీ యువకుడు కూడా పెట్టెలోనికి వచ్చి తల్లి దగ్గర కూర్చున్నాడు.

"ఏదో వీళ్ళు కనుక్కోలేని బాలారిష్టం వచ్చి ఉంటుంది పాపం" అనుకుంటూ యాంత్రికంగా తన జాగాలోకి వచ్చి కూర్చున్న గోపాలయ్య తన చేతితో సంచీని తీసుకోబోయి తేలుకుట్టినట్లు చేతిని వెనక్కు లాక్కుని కూర్చున్నాడు. 'ఎంత విచిత్రమైన పరిస్థితి' అని మనసులో వితర్కించుకున్నాడు.

చూస్తూ చూస్తూ తనకేమీ పట్టనట్లు ఊరుకోనూ లేడు. బాహాటంగా జరిగినదానికి సానుభూతి ప్రకటించి ఆ అమ్మాయిని ఊరడించనూ లేడు. తోటి ప్రయాణికులెవరైనా అభ్యంతరం లేవదీస్తే ఈ మరాఠీ యువకునికి ఎంత ఇబ్బంది కలుగుతుందో. కొన్ని గంటల క్రితమే అంతంత సామానుతో ప్రయాణాలు సాగిస్తున్నందుకు ఆ యువకుని మీద మనసులోనే విరుచుకుపడ్డాడు. వాని సమస్యను అర్థం చేసుకున్నాక తన తొందరపాటుకు నొచ్చుకున్నాడు.

ఇక ఆ బాలెంత పరిస్థితి అందరికన్నా దయనీయమైనదే. ఉదయాన్నే రైలు బయలు దేరుతున్నప్పుడు చూశాడు గోపాలయ్య. తన సర్వస్వం ఆ పసిగుడ్డే అన్నంతగా మురిసిపోతూ పదేపదే హత్తుకుని ముద్దాడింది. ఇప్పుడు నిర్జీవమైన ఆ వస్తువును ఒక్కమారు మనసు తీరా చూసుకుని గట్టిగా ఏడ్చి గుండె బరువును తగ్గించుకోలేని అసహాయమైన స్థితి. ఎండిన ఆకులా ఆమె పక్కనే కూర్చున్న వృద్ధురాలు కూడా దుఃఖం ఆపుకుని కళ్ళు ఒత్తుకుంటోంది. చేతులతో మనుమణ్ణి ఒంగి ఒంగి స్పృశిస్తోంది. చేదుగా ఉన్న వాస్తవాన్ని సులభంగా అంగీకరించడానికి ఎవరి మనసు ఒప్పుకుంటుంది కనుక. ఏదో ఆశ.

గుజరాతీ వ్యాపారులు సావధానంగా ఎవరి వ్యాపార విషయాలు వారు చర్చించుకుంటున్నారు. ఏవో వేయించి తెచ్చుకున్న తినుబండారాలు తింటున్నారు. ఒకరిద్దరు మాత్రం ఆ బాలెంత వేపూ, పక్కనే ఉన్న ఇద్దరి వేపూ మార్చి మార్చి చూస్తూ కొంతవరకూ సానుభూతితో అర్థం చేసుకున్నట్లే

ఉన్నారు. తమకెందుకని నిద్రలోకి జోగుతున్నారు. మూడేళ్ళ పిల్ల మాత్రం ఏమీ తెలియక తమ్ముడికి కప్పిన పలుచటి గుడ్డ తొలిగించి ఆడుకునే ప్రయత్నం చేయడం, తల్లి నిర్లిప్తంగా వారించడం, మరపించడం జరుగుతోంది. రైలు నందూర్ బార్, అమల్నేరు దాటి వేగంగా పరుగు తీస్తోంది. కిటికీ అద్దం మీద ఎండ పడుతోంది.



బాణంలా ఒంగి, మౌనంగా కూర్చున్న గోపాలయ్య సర్దుకుని నిటారుగా కూర్చున్నాడు. యువకుణ్ణి తట్టి దగ్గరకు పిలిచాడు. "నీ భార్యకూ, తల్లికీ కాసిన్ని మంచినీళ్ళు ఇచ్చి ఏమైనా తినిపించు. వాళ్ళకు శోష వచ్చి పడిపోతే నీకున్న సమస్య ఎక్కువ కాదూ" అన్నాడు. తన సంచీలోని మంచినీళ్ళ సీసా బయటకు తీశాడు. తల్లీ, తండ్రీ, నాయనమ్మా నిరాసక్తంగా మారి పోవడంతో బిక్కమొహం వేసుకుని నిల్చున్న పాపను దగ్గరగా పిలిచి, ద్రాక్షపళ్ళు ఇచ్చాడు. దప్పికతో ఉన్న పాప ఆర్తితో అందుకుని తింటోంది. మరాఠీ యువకుడు కూతుర్ని దగ్గరకు తీసుకుని ఏదో ఆహారం తినిపించాడు.

"ఉదయం రైలు బయలుదేరు తున్నప్పుడు ఈ రైలుపెట్టెలో మీకింకో అమ్మాయి ఉందని అనుకో మన్నావు. నా మాట విని ఏమైనా తిను. మీ ముగ్గురినీ చూసి ఆ పాప ఎలా భయపడి దిగాలుగా మొహం వేలవేసిందో చూడు" అని స్వరం తగ్గించి ఆ బాలెంతను ఊరడిం చాడు. తన సంచీలోని టిఫెన్ బాక్స్ అందివ్వబోయాడు గోపాలయ్య. కళ్ళు కొంగుతో ఒత్తుకుని కాసిన్ని మంచినీళ్ళు మాత్రం గొంతులో పోసుకుంది. ఆహారం మాత్రం ముట్ట లేదు. రైలు 'చండతరుడైన విధి'లాగ నిర్వికారంగా, నిర్విషాదంగా ప్రయాణికుల మనోభావనలతో తనకేం పని అన్నట్లు పరుగుతీస్తోంది. గుక్కెడు

**స్టేషన్‌లో బండి ఆగిందే తడవుగా గోపాలయ్య చేతిలోని నిర్జీవమైన కొట్టె మరాఠీ**

**యువకుని చేతుల్లోకి భద్రంగా చేరాక విచిత్రంగా తన మనసు తేలికపడింది.**

నీళ్ళు తాను కూడా గొంతులో పోసుకుని రెండు కళ్ళూ మూసుకున్నాడు గోపాలయ్య.

విచిత్రమైన సంచలనం అంతర్గతంగా సాగుతోంది. ఆరు దశకాలు మించిన జీవితాన్నే చవి చూశాడు. చావు అన్న పదం తనకు సరికొత్తదేమీ కాదు. కాలవాహినిలో రెండు కట్టెలు ఎల్లకాలం కలిసి పయనించవనీ, ఎప్పుడు విడిపోతాయో అర్థం కాదనీ తాత్త్వికంగా వాల్మీకి చెప్పిన శ్లోకం గుర్తుకు వచ్చింది. "యథా కాష్ఠంచ కాష్ఠంచ సమేయతాం మహార్ణవే" అని పునశ్చరణ చేసుకున్నాడు. కానీ, అనుభవం లేని చిన్న పిల్లలు అంత కఠోరమైన తాత్త్విక సత్యాన్ని ఎలా జీర్ణించుకోగలరని అంతలోనే ఎదురు ప్రశ్న వేసుకున్నాడు. సరే, కాలమే ఇక దుఃఖాన్ని మరపిస్తుందని సమాధానపడ్డాడు.

ఇంతలో కోడలు ఏదో సమస్యతో సతమత మౌతోందని అత్తగారికి తోచినట్లుంది. చెట్టంత కొడుకుని కని పెంచిన కన్నతల్లి ఆమాత్రం బాలెంత దేహధర్మాన్ని ఊహించలేనిది కాదు. శిశువుకు ఆకలయ్యే వేళకు విధిగా స్రవించే పాలధారతో సతమతమౌతున్న కోడలి చేతుల్లోని నిర్జీవ ప్రతిమను దుప్పటి మడతలతో సహా అందుకుని కోడలికి మెత్తని తువ్వాలును అందించింది. కాసేపటికి తన విలువైన వస్తువేదో ఎక్కడో మరచినట్లు కంగారుతో అత్తగారి చేతుల్లోంచి అందుకుని కిటికీలోంచి శూన్యంగా చూస్తోంది ఆ అమ్మాయి.

ఏవేవో స్టేషన్లు వచ్చి వెనక్కుపోతున్నాయి. వాటితో తనకేమీ సంబంధం లేనట్లు మౌనంగా కూర్చుంది. కిటికీ మీద పడుతున్న ఎండ చుర్రుమని గోపాలయ్యను తాకింది.

"అమ్మాయీ. పిల్లాడిమీద ఎండ పడనీయకు. ఇంకా చాలాదూరం సాగాలి ప్రయాణం" అన్నాడు హీనస్వరంతో. ఆ హెచ్చరికలోని భావం గ్రహించిందో లేదో కానీ, తల వినయంగా ఊపి, ముక్కును ఎగపీల్చి, ఎండపడుతున్న దిశగా తన వీపుని అడ్డుపెట్టి తాను కూర్చున్న పద్ధతిన కూర్చుంది.

భుసావల్ దాటిన తర్వాత ఎవడో వచ్చి "మధ్య బెర్తు నాది. వాల్చుకు పడుకుంటాను. నా ఒంట్లో బాగులేదు" అన్నాడు. ఇక మెడ వంచుకుని కూర్చోవడం సాధ్యం కాక, గోడవేపుకి మొహం తిప్పుకుని గోపాలయ్య తన బెర్తుమీద నిర్మోహంగా పడుకున్నాడు. నిద్రా మెళకువా కాని విచిత్రమైన విరామం అది. బరువుగా క్షణాలు, గంటలు దొర్లిపోతున్నాయి. మిగతా ప్రయాణికులు తిళ్ళు తిని బెర్తులమీద దుప్పట్లు పరచుకుని నిద్రలోకి జోగుతున్నారు.

రైలుపెట్టెలో చిన్నగా సంచలనం. మరాఠీ యువకుడు తన సామానంతా తలుపు దగ్గరగా చేరవేస్తున్నాడు. గోపాలయ్య కూర్చున్నాడు. లేచి తనకు సాధ్యమైన వస్తువులు తీసి తలుపు దగ్గర చేర్చాడు. చేతుల్లోని బరువుతోనే తన కాలి మడత విప్పుకుని లేచి నిలబడే ప్రయాస పడుతోంది ఆ బాలెంత. దుప్పటి మడతతో సహా ఆ పసివాడి శరీరాన్ని జాగ్రత్తగా అందుకున్నాడు. రైలు బండి వేగం తగ్గింది. వడివడిగా అడుగులు వేసుకుంటూ తలుపు దగ్గరగా వెళ్ళి నిలబడ్డాడు.

స్టేషన్‌లో బండి ఆగిందే తడవుగా మరాఠీ యువకుడూ, తల్లీ శ్రమపడి ప్లాట్‌ఫామ్ మీదికి సామాన్లు చేరవేశారు. గోపాలయ్య చేతిలోని నిర్జీవమైన కొట్టె మరాఠీ యువకుని చేతుల్లోకి భద్రంగా చేరిన కొన్ని క్షణాల్లో రైలు కదిలింది.

"ఇక స్థానబలం వాళ్ళకుంది. మౌనయానం ముగిసినట్లే. పిల్లవాడి శరీరాన్ని కరవుతీరా తాకి మనసుతీరా ఏడుస్తుంది..." అనుకుంటూ నిట్టూర్చాడు గోపాలయ్య. విచిత్రంగా తన మనసు తేలికపడింది. కళ్ళజోడు సవరించుకొని దీపానికి దగ్గరగా చేతి గడియారం ఉంచి టైమ్ చూసుకున్నాడు. ఒంటి గంట కావస్తోంది.

'ఇక నిద్రేమిటి' తన బెర్తుమీదకు వచ్చి ఒదిగి కూర్చున్నాడు. తనకెదురుగా ఉన్న మూడు బెర్తులూ ఖాళీగా లేవు. ఎవరెవరో వాటిమీదకొచ్చి దీపం ఆర్పి నిద్రకుపక్రమించారు.

కిటికీకి తల ఆన్చి కాళ్ళు జాపుకుని మౌనంగా కూర్చున్నాడు. తెలతెలవారే వేళ తన కంటికి పరిచయమైన చెట్లూ, పుట్లూ, గచ్చూ, వాకిళ్ళూ చేరువౌతూ ఉంటే లేవబోయాడు. తనకెదురుగానే బెర్తుమీద కిలకిలమని లేత గొంతు వినిపించింది. ఒక యువతి తన ముక్కుతో- గోడవార పడుకుని కేరింతలు కొడుతున్న ఆరు నెలల బిడ్డ పొట్టమీద సున్నితంగా తాకి గిలిగింతలు పెడుతోంది. గోపాలయ్య రైలు దిగాడు.

కూతురి యోగక్షేమాలు తెలుసుకున్న గోపాలయ్య భార్య సంచిని సవరిస్తూ, "అదేం, పెరుగూ అన్నం ఇలా పులియబెట్టేశారు? భోంచెయ్యలేదూ" అని అడిగింది. చెవిని పడ్డట్లు లేదు ప్రశ్న. పరధ్యానంగా ఉన్నాడు. ■